క్లుప్తంగా

9న రోజువారీ పన్ను వసూళ్ల వేలం

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీ మార్కెట్‌లో రోజువారీ పన్నుల వసూళ్లపై 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి హక్కులు కల్పించేందుకు ఈనెల 9వతేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రూ.3 లక్షలు దరావత్తు చెల్లించి రూ.5 లక్షలు సాల్వెన్సీ చూపించి పాటలో పాల్గొనవచ్చని స్పష్టం చేశారు.

వైభవంగా శిఖర ప్రతిష్ఠ



వడలిలో అగస్త్యేశ్వర స్వామి ఆలయం గాలి గోపుర శిఖర ప్రతిష్ఠ చేస్తున్న దృశ్యం

పెనుగొండ: మండలంలోని వడలి అగస్త్యేశ్వర స్వామి ఆలయం గాలి గోపుర శిఖర ప్రతిష్ఠ మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి గణపతి పూజ, అగస్త్యేశ్వర స్వామికి అభిషేకాలు, పార్వతీ మాతకు కుంకుమార్చనలు నిర్వహించారు. పుణ్యాహవచనం, పంచగవ్యం నిర్వహించారు. అనంతరం భక్తుల కోలాహలం మధ్య శిఖర ప్రతిష్ఠ వేద మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. పూర్ణాహుతి, శాంతి కల్యాణం నిర్వహించారు. ప్రతిష్ఠ మహోత్సవానికి విచ్చేసిన వేలాది మంది భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన కోలాట భజన ఆకట్టుకుంది.

రహదారి నిర్మాణం ప్రారంభం

పెనుగొండ: పెనుగొండ గ్రామంలో రహదారుల సమస్యల పరిష్కారానికి ప్రణాళిక ప్రకారం కృషి చేస్తున్నట్లు సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి తెలిపారు. గురువారం చెరుకువాడలో తిలక్ రోడ్డులో సీసీ రహదారి నిర్మాణాన్ని ఆమె ప్రారంభించారు. రూ.5 లక్షల పంచాయతీ నిధులతో ఈ రహదారిని నిర్మించనున్నారు.

కేజీఆర్ఎల్‌లో స్పోర్ట్స్ వీక్ సెలబ్రేషన్స్



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణంలోని కెజిఆర్ఎల్ ఫార్మసీ కళాశాలలో గురువారం ఫార్మసీ స్పోర్ట్స్ వీక్ సెలెబ్రేషన్స్ ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఫార్మసీ డైరెక్టర్ కె నాగేశ్వరరావు మాట్లాడుతూ స్పోర్ట్స్ వీక్ సెలబ్రేషన్స్‌లో విద్యార్థులకు క్రికెట్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్, షటిల్, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డి రాఘవ, వైస్ ప్రిన్సిపల్ కె నిర్మల తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఆర్సీ టీమ్ మెంబర్ ఎడ్వర్డ్

కాళ్ల: తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి చెత్తనుంచి సంపదను సృష్టించాలని డీపీఆర్సీ టీమ్ మెంబర్ ఎడ్వర్డ్ అన్నారు. మండలంలోని ఏలూరుపాడు గ్రామంలో గురువారం చెత్త నుంచి సంపద సృష్టిపై శిక్షణ తరగతులను నిర్వహించారు. కార్యదర్శులకు, క్లాప్ మిత్రలకు శిక్షణ ఇచ్చారు. ఇంటింటికి తిరిగి క్లాప్ మిత్రలు సేకరించిన తడిచెత్త, పొడి చెత్త గురించి, పరిసరాల శుభ్రత, సింగల్ యూజ్ ప్లాస్టిక్ గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూపతిరాజు వెంకటజగ్గరాజు, ఉపసర్పంచ్ నల్లగచ్చు ధనలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు చిన్నాపరపు రాంబాబు, ఈఓపీఆర్డీ ఎంవి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

భీమవరం అర్బన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బొండా వెంకటేశ్వర్లు అన్నారు. భీమవరం మండలంలోని అనాకోడేరులోని డీఎన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బొండా వెంకటేశ్వర్లు ఆర్థిక సహకారంతో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను మరింత సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అడవులు నరికేసి పరిశ్రమలు నిర్మించడం ద్వారా గ్లోబల్ వార్మింగ్ ప్రతి ఏడాది ఎక్కువ అవుతుందన్నారు. దీంతో సకాలంలో వర్షాలు పడడం లేదని, అలాగే ఈ ప్రభావం ప్రజల జీవనస్థితిగతులపై పడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేపాక వెంకన్న బాబు, జి. నర్మద, ఎంవీ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

దొండ సాగు.. లాభాలు బాగు

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి
- తీరంలో విస్తరిస్తున్న ఉద్యాన పంటలు



దొండ కాయలను కోస్తున్న దృశ్యం



దొండకాయలను ఒబ్బిడి చేస్తున్న రైతు దంపతులు

నరసాపురం రూరల్: తీర ప్రాంత రైతులు కొంత మంది ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా నీటి సదుపాయం ఉన్న ప్రాంతాల్లో రైతులు ఉద్యాన పంటల సాగుకు ముందుకు వస్తున్నారు. దీంతో తీరప్రాంత గ్రామాల్లో ఉద్యాన పంటలు సాగుచేసే రైతుల సంఖ్య, విస్తీర్ణం ప్రతిఏటా పెరుగుతోంది. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో కూరగాయల సాగుకు అనువైన నేలలు కావడంతో రైతాంగం వీటి పెంపకంపై దృష్టి సారించడంలో లాభాల పంట పండిస్తున్నారు. నరసాపురం మండలం రుస్తుంబాద గ్రామంలో దొండ, పొట్ల, ఆనప, వంగ తోటల సాగు చేస్తూ మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. ముఖ్యంగా సేంద్రీయ ఎరువులను వాడడం ద్వారా పండించిన పంటకు డిమాండ్ పెరిగిందని రైతులు చెబుతున్నారు. మార్కెట్లో దొండ కాయలకు రేటు ఆశాజకంగా ఉండటం, దిగుబడి ఆశించిన దానికన్నా ఎక్కువగా ఉండటంతో రైతులకు మేలు కలుగుతోంది.

రెండేళ్లపాటు దిగుబడి

దొండసాగు రెండేళ్ల పాటు దిగుబడిని ఇస్తుందని రైతులు చెబుతున్నారు ఎకరానికి ఏడాదికి ఖర్చులు పోను సుమారు రూ.30 వేలు పైబడి లాభం వస్తుందని పేర్కొంటున్నారు. సాగులో సాంకేతిక పద్ధతులను అనుసరిస్తుండటంతో పెట్టుబడి ఖర్చులు తగ్గుతున్నాయని వివరిస్తున్నారు. గతంలో రెండు పూటలా దొండ పాదులకు కూలీలతో నీరు పోయించాల్సి వచ్చేది. మారిన కాలానికనుగుణంగా విద్యుత్ మోటార్లు అమర్చుకోవడంతో నీరు సమృద్ధిగా అందిస్తుండడంతో దొండసాగు మూడు పూలు, ఆరు కాయలుగా సాగుతుంది. మార్కెట్ గిరాకికి అనుగుణంగా ఈ పందిళ్లల్లోనే ఆనప, పొట్ల సాగు కూడా రైతులు సాగు చేస్తున్నారు. నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం, సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం, సేంద్రీయ ఎరువులను వాడటం తదితర కారణాల వల్ల దిగుబడి పెరిగి పెట్టుబడి తగ్గడంతో ఈ ప్రాంత రైతులు లాభాల సాగు చేస్తున్నట్లుగా ఉంది.

ఆశాజనకంగా దొండ సాగు



కూరగాయల సాగులో ముఖ్యంగా దొండ సాగు లాభదాయకంగా ఉంది. మార్కెట్ గిరాకీకి అనుగుణంగా పండించిన రైతుకు లాభాలు ఉంటాయి. రెండెకరాలు లీజుకు తీసుకుని దొండసాగు చేస్తున్నాను. ఏడాది గడిచింది. పొలం యజమానికి లీజు సొమ్ములు చెల్లించాను ఖర్చులు పోను నాకు రూ.30 వేలు లాభం ఆర్జించాను.

– దొంకెన ప్రసాద్, కూరగాయల సాగు రైతు

విద్యార్థుల సందర్శనకు గాంధీభవన్‌లో ఏర్పాట్లు

భీమవరం: నిడమర్రు మండలం పెదనింద్రకొలను గ్రామంలోని మహాత్మాగాంధీ భవనం విద్యార్థులు వేసవి సెలవుల్లో సందర్శించడానికి ఏర్పాటు చేసినట్లు సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు గురువారం చెప్పారు. గాంధీభవనం ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యార్థులు సందర్శించే విధంగా తెరిచిఉంచే ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గాంధీ భవన్‌లో గాంధీజి జీవితచరిత్ర ఘట్టాలు, దేశం కోసం పోరాడి అమరులైనవారి ఫొటోలు, నాలెడ్జ్ సెంటర్ ఉంటాయని ప్రసాదరాజు వివరించారు. పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దిన గాంధీభవనాన్ని విద్యార్థులు సందర్శించవచ్చునన్నారు.

గోదావరి గట్టు నుంచి డంపింగ్ యార్డు మార్చాలి



నరసాపురంలో మున్సిపల్ డంపింగ్ యార్డ్ పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

నరసాపురం: స్థానిక మున్సిపల్ డంపింగ్‌యార్డ్‌ను గోదావరి గట్టు వద్ద నుంచి వీలైనంత త్వరగా మార్చడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ నాగరాణి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ డంపింగ్ యార్డును పరిశీలించారు. మిషనరీ ద్వారా చెత్తను కంపోస్ట్‌గా మారే యూనిట్‌ను పరిశీలించారు. పట్టణంలో రోజుకు ఎన్ని టన్నుల మేర చెత్త వస్తోంది? తడి, పొడి చెత్తను ఎలా సేకరిస్తున్నారు. అనే అంశాలను మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్యను అడిగి తెలుసుకున్నారు. డంపింగ్ యార్డు ద్వారా గోదావరి జలాలు కలుషితం కావడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలించడానికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. కలెక్టర్ వెంట నరసాపురం ఆర్డీఓ దాసి రాజు, డీపీఓ అరుణశ్రీ, డీఎల్‌పీఓ జోతిర్మయి, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు ఉన్నారు.

భద్రాచలానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సు

నరసాపురం: శ్రీరామనవమి పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం నరసాపురం డిపో నుంచి భద్రాచలానికి ఈ నెల 5న ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌ను నడుపుతున్నామని డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్నరెడ్డి చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శనివారం మధ్యాహ్నం 2:30 గంటలకు ఈ బస్సు బయలుదేరుతుందని చెప్పారు. పాలకొల్లు, మార్టేరు, పెనుగొండ, తణుకు, తాడేపల్లిగూడెం, ద్వారకాతిరుమల, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం, అశ్వరావుపేట, కుక్కునూరు మీదుగా భద్రాచలం చేరుకుంటుందని చెప్పారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

ఉదయగిరి సర్వీస్‌కు స్పందన

ఈ నెల 1న నరసాపురం నుంచి ఉదయగిరికి ప్రతిరోజూ తిరగేలా ఏర్పాటు చేసిన సూపర్ లగ్జరీ సర్వీస్‌కు ప్రయాణికుల నుంచి మంచి స్పందన వస్తుందని డీఎం వివరించారు. ప్రతిరోజూ సాయంత్రం 4.15 గంటలకు నరసాపురంలో బయలుదేరుతుందని చెప్పారు. పాలకొల్లు, భీమవరం, ఆకివీడు, కై కలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, కనిగిరి, పామూరు మీదుగా ఉదయగిరి చేరుకుంటుందని చెప్పారు. రిజర్వేషన్ సౌకర్యం కూడా అందుబాటులో ఉందని చెప్పారు.

భీమవరంలో ఆర్‌బీఐ వ్యవస్థాపక దినోత్సవం

భీమవరం: తొంభై ఏళ్ల క్రితం భారతదేశ ద్రవ్య ఆర్థిక స్థిరత్వానికి సంరక్షకుడిగా ఏర్పడిన ఆర్‌బీఐ మారుతున్న ఆర్థిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చెందిందని భీమవరం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ ఎం నిర్మలజ్యోతి అన్నారు. రిజర్వ్ బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవ ముగింపు సందర్భంగా భీమవరం యూనియన్ బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం ప్రకారం 1934లో స్థాపించి ప్రారంభంలో ప్రైవేట్ యాజమాన్యంలో ఉన్నప్పటికీ 1949లో జాతీయం చేయబడిందని, అప్పటి నుంచి పూర్తిగా భారత ప్రభుత్వం ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధీనంలో పనిచేస్తోందన్నారు. ఈ సందర్భంగా 27 మంది విద్యార్థులకు బ్యాంక్ విధి విధానాలపై పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

ప్రత్యేక రైళ్లను కేటాయించాలని వినతి



రైల్వే డీఎం నరేంద్ర పటేల్‌తో రైల్వే జోన్ మెంబర్లు

పాలకొల్లు సెంట్రల్: ప్రస్తుత వేసవికాలం రద్దీ కారణంగా హైదరాబాద్, బెంగుళూరుకు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని విజయవాడ సౌత్ సెంట్రల్ రైల్వే డివిజనల్ మేనేజర్ నరేంద్ర పటేల్‌ను కోరినట్లు రైల్వే డీఆర్‌యూసీసీ మెంబర్ జక్కంపూడి కుమార్ అన్నారు. బుధవారం విజయవాడలో రైల్వే డీఎంను కలిసి పలు సమస్యలపై చర్చించామని గురువారం విలేకరులకు తెలిపారు. నరసాపురం వైజాగ్ ట్రైన్‌ను రెగ్యులర్ చేయాలని, అలాగే వీక్లీ ఒకసారి నడిచే నరసాపురం–బెంగళూరు స్పెషల్ ట్రైన్‌ను రోజూ నడిచే విధంగా కృషి చేయాలని కోరామన్నారు. రైల్వే డీఎంను కలిసిన వారిలో జెడ్ఆర్‌యూసీసీ మెంబర్ కోరం రామ్మూర్తి, ఉండి రైల్వే యూజర్ కొమ్మన నాగబాబు, గాదిరాజు వెంకటేశ్వరరాజు తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో రీ–సర్వేపై అవగాహన ర్యాలీలు



యలమంచిలి: గుంపర్రులో రీ-సర్వే ర్యాలీలో పాల్గొన్న ఆర్డీఓ దాసి రాజు



పెనుగొండ: ములపర్రులో రీసర్వే ప్రాజెక్టు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: రీ–సర్వే వల్ల ప్రతి రైతుకు తమ భూమి కచ్చితంగా ఎంత ఉందో? సమగ్రంగా తెలుస్తుందని నరసాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి దాసి రాజు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రీ సర్వే ప్రాజెక్ట్‌లో గుంపర్రు గ్రామాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రీ–సర్వే పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గురువారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన గ్రామ సభలో ఆర్డీఓ దాసి రాజు మాట్లాడుతూ సర్వే సిబ్బంది భూమి కొలిచేందుకు భూమి మీదకు వచ్చి సమయంలో రైతులంతా సహకరించి రీ సర్వే సమగ్రంగా, వేగంగా జరిగేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్, సర్పంచ్ తుంగా అమూల్య, డిప్యూటీ తహసీల్దార్ పూడి డేవిడ్ సన్, ఆర్ఐ కవురు యశోద, వీఆర్ఓలు ఉండ్రాజవరపు ప్రభాకరరావు, జద్దు వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కారినికే రీ–సర్వే

పెనుగొండ: ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికే భూ రీ–సర్వే నిర్వహిస్తున్నట్లు పెనుగొండ తహసీల్దారు జిఅనితకుమారి అన్నారు. గురువారం పెనుగొండ మండలం ములపర్రులో రెండవ విడత రీ–సర్వే ప్రాజెక్టును ప్రారంభించి, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం గ్రామంలో అధికారులు, రైతులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. రీ–సర్వే అనంతరం సమస్యలు ఉత్పన్నమైతే రైతులు అధికారుల దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు రాజేష్ పాల్గొన్నారు.

గోదావరిలో వైభవంగా అమ్మవార్ల తెప్పోత్సవం



మాణిక్యాలమ్మ, కనకదుర్గమ్మ అమ్మవార్ల తెప్పోత్సవానికి సిద్ధమైన హంస వాహనం

యలమంచిలి: దొడ్డిపట్ల గ్రామ దేవతలు మాణిక్యాలమ్మ, కనకదుర్గమ్మ అమ్మవార్లకు ఉగాది సందర్భంగా జరిగే జాతర ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి వశిష్ఠ గోదావరి నదిలో తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. బాణసంచా కాల్పులు, మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు, శ్రీ చక్రానికి వశిష్ఠ గోదావరి నదిలో హంస వాహనంపై తెప్పోత్సవం నిర్వహించారు. సుమారు గంటపాటు నిర్వహించిన తెప్పోత్సవం జరుగుతున్నంత వరకు గోదావరి మధ్య లంకలో కాల్చిన బాణసంచా భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. దొడ్డిపట్ల పరిసర గ్రామాల నుంచి తెప్పోత్సవం చూడడానికి పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ఏటిగట్టు ప్రాంతమంతా భక్తులతో నిండిపోయి కళకళలాడింది. ఉత్సవాల సందర్భంగా అమ్మవార్ల ఆలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉగాది రోజున ప్రారంభమైన ఉత్సవాలు ఐదు రోజులపాటు జరిగాయి. భక్తులు ఈ ఐదు రోజులు అమ్మవార్లకు చలివిడి, పానకాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు చేబ్రోలు మణికంఠశర్మ బ్రహ్మత్వంలో అమ్మవార్లకు ఐదు రోజులు ఉదయం సామూహిక కుంకుమ పూజలు, శ్రీ చక్రానికి అర్చనలు నిర్వహించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తెప్పోత్సవం అనంతరం అమ్మవార్లను ఆలయానికి తీసుకువచ్చి ఊయల ఉత్సవం, దండాడింపు కార్యక్రమం నిర్వహించి ఆలయ ప్రవేశ చేయడంతో జాతర ఉత్సవాలు ముగిశాయి.

'స్వయం ఉపాధి సోపానం' ఇంటర్వ్యూలు



పెనుమంట్ర మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న బ్యాంకు అధికారులు

పెనుమంట్ర: స్వయం ఉపాధి సోపానం పథకం కింద నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు బీసీ కులాలతో పాటు ఓసీలో ఆర్థికంగా వెనుకబడిన వారికి కూడా సబ్సిడీ రుణాలు అందించేందుకు గురువారం పెనుమంట్ర మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలో 54 యూనిట్లు మంజూరు కాగా, రూ. కోటి మూడులక్షల 68 వేల వ్యయంతో యూనిట్లను స్థాపించేందుకు లబ్ధిదారులనుండి దరఖాస్తులు స్వీకరించారు. మండలంలో 294 మంది దరఖాస్తు చేసుకోగా, 241 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. స్థానిక బ్యాంకు అధికారులు ఈ ఇంటర్వ్యూలు నిర్వహించి ఒక్కొక్కరినుండి మూడు సెట్ల దరఖాస్తులను కూడా తీసుకున్నారు. అయితే ఈ ఇంటర్వ్యూలు మొక్కుబడిగానే సాగాయని, లబ్ధిదారుల ఎంపిక కూటమి నేతల ఆదేశాలతోనే ఎంపిక ఎప్పుడో జరిగిపోయిందని కొందరు లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుని కూడా ఇంటర్వ్యూలకు హాజరు కాలేదని చెబుతున్నారు.

నరసాపురంలో నేడు, రేపు ఇంటర్వ్యూలు

నరసాపురం రూరల్: చంద్రన్న స్వయం ఉపాధి సోపానం 2024–2025 సంవత్సరం కోసం సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి శుక్రవారం, శనివారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గాదిరాజు రామకృష్ణంరాజు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకూ చిట్టవరం, మల్లవరం లంక, కె.నవరసపురం, గొంది, సరిపల్లి, లిఖితపూడి, లక్ష్మణేశ్వరం, సారవ, కొప్పర్రు, మల్లవరం, కె.బేతపూడి గ్రామాల దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. శనివారం వైఎస్‌పాలెం, పీఎం లంక, తూర్పుతాళ్లు, చామకూరిపాలెం, ఎల్బీచర్ల, పసలదీవి, వేములదీవి పడమర, వేములదీవి తూర్పు, బియ్యపుతిప్ప, మర్రితిప్ప, దర్బరేవు, రాజుగారితోట, సీతారామపురం నార్త్, సీతారామపురం సౌత్, రుస్తుంబాద గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రశాంతం

తాడేపల్లిగూడెం (టీటీసీ): జాతీయ సాంకేతిక విద్యా సంస్థల్లో ప్రవేశాలకు గానూ నిర్వహించే ప్రవేశ పరీక్ష జేఈఈ మెయిన్స్ రెండోవ విడత పరీక్ష రెండో రోజు గురువారం నిర్వహించారు. పట్టణంలోని శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం, సాయంత్రం రెండు పూటల పరీక్షలు నిర్వహించారు. ఉదయం జరిగిన పరీక్షకు 175 మంది, సాయంత్రం జరిగిన పరీక్షకు 176 మంది హాజరయ్యారు.

బాలాత్రిపురసుందరీ దేవికి ప్రత్యేక పూజలు

భీమవరం(ప్రకాశం చౌక్): వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మెంటేవారితోటలోని బాలాత్రిపుర సుందరీ దేవికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. పట్టణానికి చెందిన కడియం సతీష్ కుమార్, రామ అరుణ నాగ ఫణిజ దంపతులతో అమ్మవారికి కుంకుమార్చన, నక్షత్ర హారతులు పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి సారె అందజేశారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఆకివీడు: రైతులకు మద్దతు ధర లభించే విధంగా అధికారులు కృషిచేయాలని, రైతులు సహకరించాలని డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణంరాజు విజ్ఞప్తి చేశారు. మండలంలోని అయిభీమవరం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం నేరుగా మిల్లులకు తోలుకునే అవకాశం ఉందన్నారు. జేసీ రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీఓ ప్రవీణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

అధ్వానంగా మొక్కల పెంపకం

నీళ్లు పోసే నాథుడే లేక ఎండిపోతున్న మొక్కలు



రైల్వే స్టేషన్ రోడ్డులో డివైడర్ల మధ్య ఎండిపోతున్న మొక్కలు

నరసాపురం: మునిసిపాలిటీలో మొక్కల పెంపకం కార్యక్రమం అధ్వానంగా మారింది. చిత్తశుద్ధి లేకుండా తూతూ మంత్రంగా కార్యక్రమం నిర్వహించడంలో ఏ మాత్రం ఉపయోగం లేకుండా పోయింది. మొత్తంగా లక్షలు ఖర్చుపెట్టి చేపట్టిన మొక్కల పెంపకం లక్ష్యం లేకుండా పోయింది. కొన్నేళ్లుగా మొక్కల పెంపకం కార్యక్రమాన్ని ప్రభుత్వాలు అట్టహాసంగా జరుపుతున్నాయి. స్థానికంగా మునిసిపాలిటీలో అయితే ఈ కార్యక్రమాన్ని మరీ హడావుడి చేశారు. పట్టణంలో లక్ష మొక్కలు పెంచడం ధ్యేయమంటూ అధికారులు హంగామా చేశారు. దీంతో పలు దఫాలుగా పట్టణంలో మొక్కలు నాటారు. అయితే వాటి సంరక్షణను మాత్రం గాలికి వదిలేశారు. దీంతో పట్టణంలో గోదావరిగట్టు, వైఎన్ కళాశాలరోడ్డు, ఎన్టీఆర్ కాలనీ, నందమూరి కాలనీ, బస్టాండ్ ప్రాంతం, రైల్వే స్టేషన్‌రోడ్డు ప్రాంతాల్లో నాటిన మొక్కలు కనిపించడంలేదు. ఆవులు, దూడలు తినేయడం, నీళ్లు వేయడం లాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో చచ్చిపోయాయి. సాక్షాత్తు మునిసిపల్ కార్యాలయం ఆవరణలోనే మొక్కలకు నీళ్లపోసేవారు లేక ఎండిపోతున్నాయి.

లక్ష మొక్కలు లేకపోయినా లక్షల్లో ఖర్చు

పట్టణంలో ఏకంగా లక్ష మొక్కలు నాటుతామని అప్పట్లో చెప్పారు. ప్రస్తుతం ఎక్కడా మొక్కలు కనిపించడం లేదు. కానీ లక్షల్లో మునిసిపల్ నిధులు మాత్రం ఖర్చయ్యిపోయాయి. గత మూడేళ్లలో పట్టణంలో మొక్కలు పెంపకం కోసం రూ.8 లక్షలు ఖర్చుచేసినట్టు మునిసిపల్ రికార్డులను బట్టి తెలుస్తుంది. ప్రతిఏటా మునిసిపల్ బడ్జెట్‌లో మొక్కల పెంపకానికి నిధులు కేటాయిస్తున్నారు. కానీ కొత్తగా ట్రీగార్డులు మాత్రం ఎక్కడా ఏర్పాటు చేయలేదు. అంతేకాదు, కొన్ని చోట్ల పాతట్రీగార్డులు ఉన్నాయి. గతంలో మొక్కలు వేసి, ట్రీగార్డులు ఉంచిన ప్రాంతాల్లో ఆ మొక్కలు పెరిగిపోయి ట్రీ గార్డులు నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని ఆ స్థానాల్లో తీసి, కొత్తగా మొక్కలు పాతినచోట ఏర్పాటు కూడా చేయడం లేదు. వేసవి వచ్చేసింది. ఎండలు పెరిగిపోయాయి. మొక్కల సంరక్షణపై ఇప్పటికైనా దృష్టిపెట్టకపోతే పరిస్థితి మరింత దారుణంగా తయారయ్యే అవకాశం ఉందని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.